ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
3★
సోమవారం 2 జూన్ 2025



ఆత్మహత్యల నివారణ కమిటీ సేవలు అభినందనీయం

పెద్దపల్లిటౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) ఆత్మహత్యల నివారణ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 20 సంవత్సరాలుగా అవగాహన సదస్సులను చేపట్టడం అభినందనీయమని పెద్దపల్లి జిల్లా బసంత్ నగర్ వాసి, మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ పరికిపండ్ల నరహరి అన్నారు. పెద్దపల్లికి ఒక ప్రైవేట్ కార్యక్రమానికి విచ్చేసిన నరహరిని కమిటీ సభ్యులు ఆదివారం కలుసుకున్నారు. ఆత్మహత్యలు నివారణ కమిటీ బృందం సభ్యుడు ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ అశోక్ సారథ్యంలో పెద్దపల్లిలో మర్యాదపూర్వకంగా నరహరిని కలిసి ప్రస్తుతం నడుస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ జీవితం జీవించ డానికేనని, మనిషి జీవితం చాలా విలువై నదని, తాత్కాలిక కష్టాల కోసం శాశ్వతమైన జీవితానికి చరమాంకం పాడటం సమంజసం కాదన్నారు. మనిషికి కష్టాలు వచ్చినప్పుడు తనకున్న అన్ని దారులు మూసుకుపో యినప్పుడు మాత్రమే ఆత్మహత్య అనే దారి తెరుచుకుంటుందన్నారు. అటువంటి క్లిష్ట సమయంలో మిత్రులు, బంధువులు, ఆత్మీ యులు స్వాంతన చేకూర్చడం సామాజిక బాధ్యత అన్నారు. తద్వారా మరొక్క నిండు ప్రాణాన్ని కాపాడగలిగే అవకాశం ఉంటుందని తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా డీజీపీ డాక్టర్ జితేందర్ ఆదేశాల మేరకు ఇటీవల పోలీస్ శాఖలో ఆత్మహత్యలు జరుగుతున్న క్రమాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. ప్రతి జిల్లాలో ఆత్మహత్యల నివారణ కమిటీ చేపడుతున్న కార్యక్రమాల పట్ల సంతృప్తిని వ్యక్తం చేసి త్వరలో మధ్యప్రదేశ్ కు సైతం విస్తరించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ గుమ్మడవెల్లి శ్రీనివాసులు గురుజీ, రామ రిషికేష్ తదితరులు పాల్గొన్నారు.

- రామగుండంలో మొదలైన పనులు
- బస్టాండ్ వద్ద సర్వీస్ రోడ్డు నిర్మాణానికి మోక్షం
- లక్ష్మీనగర్‌లో పూర్తి కావస్తున్న విస్తరణ
- ఎన్టీపీసీలో మేడిపల్లి సెంటర్, మల్కాపూర్ రహదారుల విస్తరణ
- విస్తరణ జరిగిన ప్రాంతాల్లో రోడ్లు, కూడళ్ల నిర్మాణాలు



కళ్యాణ్‌నగర్ జంక్షన్ విస్తరణకు కొనసాగుతున్న పనులు

ముమ్మరంగా రోడ్ల విస్తరణ

కోల్‌సిటీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రామ గుండంలో వ్యాపార అభివృద్ధి, పెరు గుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా సౌకర్యాల కల్పనకు నగరపాలక సంస్థ పరిధిలో రోడ్ల విస్తరణ చేపట్టారు.ఈ కార్యక్రమం గోదావరిఖని, ఎన్టీపీసీ ప్రాం తాల్లో ముమ్మరంగా సాగుతు న్నాయి. నగరంలోని వ్యాపార కేంద్రాలైన లక్ష్మీ నగర్, కళ్యాణ్‌నగర్, మేదరిబస్తీ, అడ్డ గుంటపల్లి రహ దారుల్లో రోడ్ల విస్తరణ చేపట్టారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తా కేంద్రంగా ఈ విస్తరణ కార్యక్రమం మొద లైంది. లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్, ఉల్లిగడ్డల బజార్ ప్రాంతాల్లో రోడ్ల విస్తరణతో పాటు భవిష్యత్ 50ఏళ్ల అవసరాలకు అనుగుణంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇరువైపులా వీధిదీపాలు, అండర్ గ్రౌండ్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు 35కోట్ల రూపాయలు కేటాయించారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ టీయూ ఎఫ్ఐడీసీ నిధులు 100కోట్ల రూపాయలు మంజూరు చేయించగా 35కోట్ల రూపాయలను వ్యాపార కేంద్రాల్లో వెచ్చిస్తున్నారు. గోదావరిఖని పట్టణంలోని వ్యాపార కేంద్రాలు, ప్రధాన కూడళ్లలో రోడ్ల విస్తరణ చేస్తున్నారు. గోదావరిఖని బస్టాండ్ వద్ద రాజీవ్ రహదారి సర్వీస్ రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న నిర్మాణాలను తొలగించారు. బస్టాండ్ ముందున్న కాంగ్రెస్ నాయకుడు గాజుల రాజమల్లు భవనాన్ని సైతం తొలగించారు. నిర్వాసితులైన వారికి ప్రత్యా మ్నాయ స్థలాలను చూపారు. సర్వీస్ రోడ్డు పనులను సైతం ప్రారంభించారు.

జంక్షన్ల అభివృద్ధికి ప్రణాళికలు

రామగుండం నగరపాలకసంస్థ పరిధిలో వివిధ కూడళ్లలో జంక్షన్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమ య్యాయి. ఇప్పటికే ఈ పనులకు టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యింది. మున్సిపల్ జంక్షన్, మెయిన్ చౌరస్తా, మేడిపల్లి సెంటర్, ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు, గౌతమినగర్ జంక్షన్‌ను అభివృద్ధి చేయనున్నారు. రాజీవ్ రహదారి సర్వీస్ రోడ్ల నిర్మాణం చేపట్టడమే కాకుండా ఎన్టీపీసీ, సింగరేణి స్థలాలు ఉన్న ప్రాంతాల్లో విస్తరించనున్నారు. జీఎం ఆఫీస్, బంగ్లాస్ ఏరియా, బీ పవర్‌హౌస్ ప్రాంతాల్లో ఈ విస్తరణ జరుగనున్నది.

ఇరుకు రోడ్లు.. ఆక్రమణలు..

మార్కండేయకాలనీ-అడ్డగుంటపల్లి 60 అడుగుల ప్రధాన రహదారిపై ఉన్న భవనాన్ని నగరపాలక సంస్థ తొలగించింది. భవనం శిథిలావస్థకు చేరడం, రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న భవనాన్ని తొలగిం చారు. భవనం తొలగిస్తున్న క్రమంలోనే ఒక్కసారిగా కుప్పకూలి శిథిలాలు ఎక్స్‌కావేటర్‌పై పడ్డాయి. మార్కండేయకాలనీ ప్రాంతం వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందడం, మార్కండేయకాలనీ నుంచి ఎఫ్ సీఐ రోడ్డు వరకు క్వార్టర్లు, షాపింగ్ మాల్స్ రావడంతో ఈ రహదారి రద్దీగా ఉంది. 60 అడుగు లకు ఆర్‌డీపీ ఆమోదం ఉన్నా స్థానికుల విజ్ఞప్తి మేరకు గతంలో 50 అడుగులుగానే విస్తరించారు. 50 అడుగుల రహదారిలోనూ అనేక ఆక్రమణలు ఉన్నా యి. అలాగే గోదావరిఖని కళ్యాణ్‌నగర్ కూడలిని కూడా విస్తరిస్తున్నారు. నగరానికి సరుకులను తీసుకువచ్చే వాహనాలు ఈ కూడలి గుండానే రావాల్సి ఉంది. ఉల్లిగడ్డల బజార్, కళ్యాణ్‌నగర్...

(మిగతా 6వ పేజీలో)

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను వైభవంగా నిర్వహించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణ వేడుకలను పెద్దపల్లి జిల్లాలో వైభవంగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత కలెక్టరేట్ ప్రాంగణంలో రాష్ట్ర అవతరణ వేడుకల ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ సోమవారం కలెక్టరేట్‌లో జరిగే వేడుకలను ఘనంగా నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ముఖ్య అతిథిగా హాజరు అవుతారని కలెక్టర్ తెలిపారు. ఉదయం 9.45గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుంటారని, ఉదయం 9 .50గంటలకు గౌరవ వందనం, అనంతరం అమరవీరులకు నివాళి అర్పిస్తారన్నారు. ఉద యం 10 గంటలకు జాతీయ పతాకావిష్కరణ, జాతీయ, తెలంగాణ గీతాలా పన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఉదయం 10.11నుంచి 10.15 గంటలవరకు పరేడ్ ఉంటుందని, అనంతరం ముఖ్య అతిథి తన సందేశం అందిస్తారని కలెక్టర్ తెలిపారు. అనంతరం రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని అన్నారు. వేడుకలకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బం దీగా పూర్తిచేయాలని ఆదేశించారు. సౌండ్ సిస్టం, విద్యుత్ సరఫరా, వేదిక, టెంట్, బ్యారికేడ్లు వంటి ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ పలు సూచనలు చేశా రు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ డి వేణు, డీసీపీ కరుణాకర్, ఏసీపీ గజ్జి కృష్ణ, పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ గోశాల పరిశీలన

పెద్దపల్లిటౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ ఆధ్వర్యంలో నడుస్తున్న గోశాలలో పదుల సంఖ్యలో కోడెలు మృతి చెందడాన్ని నిజనిర్ధారణ కమిటీ ఆదివారం పరిశీలించింది. డాక్టర్ గుమ్మడవెల్లి శ్రీనివాస్, గోశాలల తెలంగాణ ప్రతినిధి బృందం ఆధ్వర్యంలో కోడెల పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోశాలలోని కిక్కిరిసిన పరిస్థితిలో కట్టివేయడం, కోడెలకు సరైన ఆలనాపాలనా, పోషణ లేక అవి నీరసించాయని గమనించారు. అధికారులు సరిగా చూసుకోక పోవడం వల్ల, అతి తక్కువ స్థలంలో అది ఎక్కువ కోడెలను కట్టి వేయడం వల్ల అవి అనారోగ్యం పాలై మృతి చెందుతున్నట్లు గుర్తించారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఓదెల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. గ్రామస్థులు నిన్ను ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న తాగునీటి ట్యాంక్ నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులకు రూ. 93.90 కోట్ల మేరకు నిధుల కేటాయింపుపై హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మండలంలోని గ్రామాల్లో రైతులతో పాటు గ్రామాలు నిరాదారణకు గురయ్యాయని తెలిపారు. రూపు నారాయణపేట మానేరు వాగు నుంచి నిర్మించనున్న వంతెనకు రూ. 80 కోట్లు, ఓదెలలో నీటి ట్యాంకు నిర్మాణానికి రూ. 90 లక్షలు, ఓదెల నుంచి మల్లికార్జున స్వామి ఆలయం మీదుగా పెగడపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి రూ. 13 కోట్ల మేరకు నిధులను కేటాయింపునకు ఎమ్మెల్యే కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, చీకట్ల మొండయ్య, బైరి రవీందర్‌గౌడ్, బోడకుంట శంకర్, సిరిసేటి రాహుల్, చింతం కుమారస్వామి, ఆకుల మహేందర్, బోడకుంట స్వామి, చొప్పరి రాజయ్య, నాగపురి రవి గౌడ్, జక్కుల వెంకటస్వామి, గోపతి సదానందం పాల్గొన్నారు.

డీసీపీ కరుణాకర్‌కు తెలంగాణ పోలీస్ సేవా పతకం



డీసీపీ కరుణాకర్, ఏసీపీ ప్రతాప్, ఎస్ఐ సహదేవ్‌సింగ్, ఏఎస్ఐ బీ శ్రీనివాసరావు, ఏఎస్ఐ మల్లేషం, ఏఎస్ఐ సుధాకర్, హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య

- పలువురు అధికారులు, సిబ్బందికి పతకాలు

కోల్‌సిటీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రభుత్వం మహోన్నత, సేవా పతకాలను ప్రకటించింది. దానిలో పెద్దపల్లి డీసీపీ కరుణాకర్‌కు తెలంగాణ పోలీస్ సేవా పథకం లభించింది. రామగుండం కమిషరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన పలువురు అధికారులు, సిబ్బందికి ఉత్తమ సేవ, సేవా పతకాలు లభించాయి. రామగుండం ట్రాఫిక్ ఏఎస్ఐ బీ శ్రీనివాసరావుకు తెలంగాణ స్టేట్ పోలీస్ మహోన్నత సేవా పతకం లభించింది. ఏఆర్ఎస్ఐ ఆర్ శ్రీహరి, ప్రకాష్‌లకు ఉత్తమ సేవా పతకాలు లభించాయి. బెల్లంపల్లి ఏఆర్ ఏసీపీ సీహెచ్ ప్రతాప్ సేవా పతకానికి ఎంపికయ్యారు. రామగుండం ట్రాఫిక్ ఎస్ఐ సహదేవ్‌సింగ్, గోదావరిఖని టుటౌన్ ఏఎస్ఐ ఎస్ సుధాకర్, ట్రాఫిక్ ఏఎస్ఐ వీ మల్లేషం, వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ ఎం సత్యకు సేవా పతకాలు లభించాయి.

తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యాలయ కార్యదర్శిగా బాలాజీరావు



కవితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న బాలాజీ రావు

సుల్తానాబాద్, జూన్ 1 (ఆంధ్ర జ్యోతి): తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యాలయ కార్యదర్శిగా సుల్తానాబాద్ మాజీ ఎంపీపీ పొన్నమనేని బాలా జీరావు నియమితుల య్యారు. ఈ మేరకు జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో పాటు రాష్ట్ర కార్యాలయ బాధ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుల్తానాబాద్ మండలం కొదురుపాక గ్రామానికి చెందిన బాలాజీరావు సుల్తానాబాద్ టీఆర్ఎస్ అధ్యక్షుడిగా 17 ఏళ్ల పాటు కొనసాగారు. 2001 నుంచి 2005 వరకు కొదురుపాక సర్పంచ్‌గా, 2019 నుంచి 2024 వరకు సుల్తానాబాద్ ఎంపీపీగా సేవ లందించారు. తనను జాగృతి రాష్ట్ర కార్యాల య కార్యదర్శిగా నియామకం చేసినందుకు గాను బాలాజీరావు ఆదివారం ఎమ్మెల్సీ కవితను హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. జాగృతి రాష్ట్ర కార్యాలయ కార్యదర్శిగా నియామకం అయిన బాలాజీ రావును పెద్దపల్లి జిల్లా నాయకులు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

నేత్రదానం మహా దానం

కమాన్‌పూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) నేత్రదానం మహాదానమాని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి, కార్యదర్శి నల్లవెల్లి శంకర్ అన్నారు. మండలంలోని రొంపికుంట గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్న పులిపాక మొండయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. సదాశ య ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ కమాన్‌పూర్ ఆధ్వర్యంలో మొండయ్య కుటుంబసభ్యులు నేత్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం అభినందన సభ నిర్వహించి మొండయ్య కుటుం బానికి 50కేజీల బియ్యం, 1000 రూపాయలు, అభినందన పత్రాన్ని అం దజేశారు. ఈ కార్యక్రమంలో సదాశ య సభ్యులు అనవేణ లక్ష్మీరాజం, పులి పాక బానయ్య, శ్యాంసుందర్, కళాకా రులు సమ్మయ్య, నారాయణ, మొండ య్య కుటుంబ సభ్యులు ఉన్నారు.

వేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

మంథనిరూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు మండలంలో వేగంగా జరుగుతున్నాయి. మండలం లో 35 గ్రామ పంచాయతీలు ఉండగా అడవిసోమన్‌పల్లి గ్రామపంచాయతీని పైలట్ గ్రామంగా అధికారులు ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని మంజూరు చేశారు. గ్రామపంచాయతీలో అర్హులైన 228 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా 216 మంది నిర్మాణాలను చేపట్టారు. ఇప్పటి వరకు 134 మంది లబ్ధిదారులు బేస్‌మెంట్ లెవల్ వరకు నిర్మాణం చేపట్టగా అందులో 116 మందికి బిల్లులు మంజూరయ్యాయి. రెంటల్ లెవల్‌లో 15 ఇళ్ల నిర్మాణం కాగా, రూఫ్ లెవల్‌లో తొమ్మిది, స్లాబ్ లెవల్‌లో రెండు పూర్తి కాగా, ఒక్కరికి బిల్లులు మంజూరు అయ్యాయి. అడవిసోమన్‌పల్లిలో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయటానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. హౌజింగ్, మండల పరిషత్ అధికారులు గ్రామంలో ప్రతీరోజు పర్యటించి ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు బేస్‌మెంట్ లెవల్ లక్ష రూపాయలు, రూఫ్ లెవల్‌లో మరో లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మాణంతో రెండు లక్షల రూపాయల చొప్పున బిల్లులు చెల్లించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇళ్లు పూర్తిగా నిర్మించుకున్న వారికి మరో లక్ష రూపాయలు కలుపుకొని మొత్తం ఐదు లక్షల రూపాయలు చెల్లిస్తామని అధికారులు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిన నాటి నుంచి గ్రామంలో కలెక్టర్ కోయ శ్రీహర్షతోపాటు హౌజింగ్ జిల్లాస్థాయి అధికారులు ప్రతిరోజు పర్యవేక్షణ చేయడంతోపాటు గ్రామ పంచాయతీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్నారు. మరో 12 ఇళ్ల నిర్మాణాలను చేపట్టడానికి లబ్ధిదారులను ప్రోత్సహి స్తున్నట్టు అధికారులు తెలిపారు.



స్లాబ్ లెవల్ వరకు పూర్తయిన ఇందిరమ్మ ఇల్లు

ఆధునిక పద్ధతులతో అధిక లాభాలు



రాగినేడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పెద్దపల్లి రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో ఆధునిక పద్ధతులతో పంటలు సాగు చేస్తే అధిక లాభాలు పొందుతారని కేవీకే శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బ్రాహ్మణపల్లి రైతు వేదిక, రాగినేడు, కనగర్తి గ్రామాల్లో వ్యవసాయ శాఖ, కేవీకే రామగిరి ఖిల్లా ఆధ్వర్యం లో వికాసిత్ కృషి సంకల్ప్ అభియాన్ అనే ముందస్తు ఖరీఫ్ రైతు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాలకు హజరైన శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు పంట పొలాల్లో పశువుల పేడ, కోళ్ల ఎరువులను వినియోగించాలని, పచ్చిరొట్ట పంటలు సాగు చేసి భూమిలో కలియ దున్నాలని సూచించారు. పురుగుల మందులు అవసరానికి మించి వాడొద్దన్నారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు డా. వెంకన్న, డా.కిరణ్, నరేష్, హైదరబాద్ ఐసిఏఆర్ ప్రదాన శాస్త్రవేత్తలు డా.ముత్తు కుమార్, డా. యోగేష్, డా. పాల్ యాదవ్, అప్పన్నపేట సింగిల్ విండో చైర్మన్ చింతపండు సంపత్, మండల వ్యవసాయాధికారిణి అలివేణి, ఏఈవో పూర్ణచందర్ పాల్గొన్నారు.

- స్వయం సహాయక సంఘాలకు కుట్టే బాధ్యత
- 90 శాతం పూర్తి
- అదనపు ఉపాధి పొందుతున్న మహిళలు



విద్యార్థుల యూనిఫాం సిద్ధం

పెద్దపల్లి రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు యూనిఫామ్స్ కుట్టే పనిని గుత్తేదారులకు అప్పగించగా విద్యార్థులకు సరిపోయే సైజులు రాకపోగా విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. పాఠశాలలు ప్రారంభం అయినా కూడా అందించని పరిస్థితి ఉండేది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలు ఆర్థికాభివృద్ధిలో ముందుండాలని మహిళా సంఘాల సభ్యులకు విద్యార్థుల యూనిఫాంలను కుట్టే పనిని అప్పగించింది. తద్వారా మహిళలకు అదనపు ఉపాధి సమకూరుతోంది.

54 పాఠశాలలు, 2,337 మంది విద్యార్థులు

మండలంలోని 30 గ్రామపంచాయతీల్లో 54 ప్రభు త్వ పాఠశాలు ఉన్నాయి. గతేడాది ప్రభుత్వ పాఠశాల ల్లో 1,165 బాలురు, 1,172 బాలికలు మొత్తం 2,337 మంది విద్యార్థులు విద్యను అభ్యసించారు. ప్రతీ విద్యార్థికి ఒక జత చొప్పున యూనిఫాంలను పాఠశాలలు ప్రారంభ దశలోనే అందించనున్నారు. ఒక జత యూనిఫాం కుట్టినందుకు గాను ప్రభుత్వం 75 రూపాయలు ఇస్తోంది. విద్యార్థులకు సరిపడా దుస్తులు కుట్టేందుకు రెండు క్లస్టర్లను ఏర్పాటు చేశారు. మండలంలోని తుర్కలమద్దికుంట, భోజన్నపేట గ్రామాల్లో క్లస్టర్ల వారీగా ఏర్పాటు చేసి యూనిఫాం కుట్టే పనిని అప్పగించారు. ఆయా గ్రామాల్లోని మహిళ సంఘాల సభ్యులకు..

(మిగతా 6వ పేజీలో)

మేనమామలా పెండ్లి చేసిండ్లు.. మేం చల్లగా ఉన్నం..

- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధును కలిసిన దంపతులు

ముత్తారం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు లేకపోయినా మేనమామలా ముందుండి పెండ్లి చేసిండ్లు...మేము పిల్లా పాపలతో చల్లగా ఉన్నామంటూ ముత్తారం మండలం ఖైదబండ గ్రామానికి చెందిన పందుల కోమలత-దేవెందర్ దంపతులు అన్నారు. ముత్తారం మండలం ఖైదంబండ గ్రా మంలో ఆదివారం జరిగిన పలు కార్యక్ర మాల్లో పాల్గొనేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్‌ను కోమలత దంపతులు కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. మంథని ఎమ్మెల్యే గా 2018లో పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మంథనిలో పేదింటి ఆడబిడ్డలకు సాంప్రదాయ పద్ధతిలో జరిపించిన సాముా హిక వివాహల్లో కోమలత దేవేందర్‌ల వివాహం జరిగింది. ఈ క్రమంలో ముత్తారం మండలం ఖైదబండ గ్రామానికి ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్‌ను కలిసి మాట్లాడారు. పుట్ట మధు తన మేనమామ స్థానంలో నిలిచి పెండ్లి జరిపించాడని, తన కుటుంబం ఈనాడు ఎంతో సంతోషంగా ఉందని కోమలత అన్నారు.

ఆయిల్‌పామ్ తోట దగ్ధం



కొసునూర్‌పల్లె గ్రామంలో దగ్ధమవుతున్న ఆయిల్ పామ్ తోట

దర్మపురి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): దర్మపురి మండలంలోని కొసునూర్‌పల్లె మాజీ సర్పంచ్ ఎన్నం లక్ష్మారెడ్డికి చెందిన ఆయిల్ పామ్‌తోట విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఆదివారం దగ్ధం అయ్యింది. రెండున్నర ఏళ్ల క్రితం మూడు ఎకరాల్లో లక్ష్మారెడ్డి ఆయిల్ పామ్‌తోట పెంపకం చేపట్టారు. మధ్యాహ్నం వీచిన గాలుల వల్ల విద్యుత్ వైర్లులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు లేచి ఆయిల్ పామ్ తోటలో చెట్లు కాలిపోయాయి. పైపు లైన్ కాలిపోవడంవల్ల భారీనష్టం వాటిల్లింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు, మాజీసర్పంచ్ ఎన్నం లక్ష్మారెడ్డి కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): చేగుర్తి గ్రామశివారులో ఆదివారం అక్రమంగా ఇసుకతరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ యజమాని పత్తి అజయ్ పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. మరోసారి ఇదే నేరానికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సెలవుల్లో కంప్యూటర్ శిక్షణ

• సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులు • ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు

గణేశ్‌నగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో విద్యార్థులు తమకు ఇష్టమైన రంగంలో శిక్షణ తీసుకుంటారు. క్రీడలు, స్విమ్మింగ్, కరాటే, స్పోకెన్ ఇంగ్లీష్ వంటివి నేర్చుకుంటారు. మరికొందరు సంగీతం, వివిధ రకాల కళలను నేర్చుకుంటారు. ప్రస్తుత పోటీ



ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలకు వేసవి సెలవుల్లో కంప్యూటర్ శిక్షణ ఇప్పిస్తున్నారు. దీంతో పట్టణాల్లో కంప్యూటర్ సెంటర్లు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. మరో వైపు యువత ఉద్యోగానికి అవసరమైన శిక్షణ తీసుకుంటున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల యువత, విద్యార్థులు వేసవి సెలవుల్లో ప్రతిరోజు జిల్లా కేంద్రంలోని కంప్యూటర్ సెంటర్లలో శిక్షణ పొందుతున్నారు. కొందరు ఉపాధి కోసం మరికొందరు ఉన్నత చదువుల కోసం శిక్షణ తీసుకుంటున్నారు.

● డిమాండ్ ఉన్న కోర్సులు

కంప్యూటర్ కోర్సులో ఎంస్ ఆఫీస్ ప్రతి ఒక్కరూ నేర్చుకునేందుకు ఎక్కువగా ఇష్టపడతారు. ఫొటోషాప్, డీటీపీ, టాలీ, ఆటో కాడ్ వంటి కోర్సులు నేర్చుకుంటున్నారు. వీటి తర్వాత పీజీడీసీఏ ఆరు నెలల కోర్సు కావడంతో అవసరం ఉన్నవారు మాత్రమే దానిని ఎంచుకుంటారు. శిక్షణ పొందిన వారు కొందరు ఇంటర్‌నెట్ సెంటర్లలో, కళాశాలలు, ఆస్పత్రుల్లో కంపూటర్ ఆపరేటర్లుగా పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు నెల రోజులు పాటు ఇచ్చే శిక్షణకు రూ.2000 వరకు తీసు కుంటున్నారు. శిక్షణ అనంతరం పరీక్ష నిర్వ హించి కేంద్ర ప్రభుత్వం అనుమతి పొందిన ఐఎస్‌ఓ సర్టిఫికెట్ అందజేస్తున్నారు.



కంప్యూటర్ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి

- శ్రీధర్, ఓంకార్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు



ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏ రంగంలోనైనా కంప్యూటర్ అనుసంధానంగానే పనులు జరుగుతున్నాయి. గతంలో అవసరం ఉంటేనే కంప్యూటర్ నేర్చుకునేవారు.. కానీ నేడు కంప్యూటర్ నేర్చుకొని ఉండటం తప్పనిసరి. శిక్షణ అనంతరం కొంత మందికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తున్నాం. మా వద్ద శిక్షణ తీసుకున్న వారు కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తక్కువ ఫీజు

- బంధారపు అజయ్, స్పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, చొప్పదండి



గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు అతి తక్కువ ఫీజుతో కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నాం. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు బీటెక్‌లో ఉండే సిలబస్‌ను ముందుగానే వేసవి సెలవుల్లో అవగాహన కల్పిస్తున్నాం. టెన్త్, ఇంటర్ డిగ్రీ విద్యార్థులకు కంప్యూటర్ విద్య తప్పనిసరిగా అవసరం. ఏం చదువుకున్నా ఉద్యోగ సమయంలో కంప్యూటర్ చాలా ఉపయోగపడుతుంది.

ఉపాధి పొందేందుకు శిక్షణ

- అబ్రార్, విద్యార్థి



వేసవి సెలవులను వృథా చేయకుండా ప్రస్తుతం నగరంలోని ఓంకార్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్‌లో టాలీ నేర్చుకుంటున్నా. టాలీపై పట్టు సాధించి ప్రభుత్వ ప్రైవేట్ ఏదైనా ఉద్యోగంలో చేరాలనేది నా కోరిక. ఇక్కడ సులభంగా ఆర్థమయ్యే విధంగా నేర్పిస్తున్నారు.

భవిష్యత్ కోసం

- ఎస్ హిరణ్య, విద్యార్థిని



నేను ఇంటర్ పూర్తిచేశాను. చొప్పదండిలోని స్పేస్ కంప్యూటర్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్నాను. ఉన్నత చదువుల కోసం, భవిష్యత్ ఉద్యోగ ప్రయత్నాల్లో ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఎంఎస్ ఆఫీస్ నేర్చుకుంటున్నా.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

రామగిరి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్‌లో పేకాట ఆడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు ఆదివారం సిబ్బందితో బేగంపేట్‌లో దాడులు నిర్వహించగా పేకాట ఆడుతూ ముగ్గురు వ్యక్తులు పట్టుపడ్డారన్నారు. వారివద్ద నుంచి 2,310 రూపాయలు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్ క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వన్ టౌన్ ఎదుట ఉన్న ఒక లాడ్జి సమీపంలో ఆదివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. చనిపోయిన వ్యక్తికి సుమారు 55 ఏళ్లు ఉంటాయని, ప్రభుత్వాస్పత్రిలోని మార్చురిలో భద్ర పరిచామని పేర్కొన్నారు. మృతుడిని గుర్తించినవారు ఒకటో టౌణా పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

మల్లాపూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండలంలోని ఒడ్డెరకాలనీకి చెందిన దండుగుల శ్రీనివాస్(22) అనే యువకుడు ఆదివారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై లక్ష్మణ్ తెలిపారు. శ్రీనివాస్ రెండేండ్ల క్రితం హైదరాబాద్‌లో లాండ్రి సెంటర్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. తల్లికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో మల్లాపూర్ లోనే ఉంటున్న శ్రీనివాస్ జీవితంపై విరక్తి చెందాడు. ఆదివారం ఉదయం గ్రామశివారులోని చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణం పొందాడు. అటు వైపు వెళ్తున్న స్థానికులు గమనించి కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. శ్రీనివాస్ చిన్నతాత శివరాత్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి బలవన్మరణం


రామడుగు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో జీవితం మీద విరక్తి చెందిన వృద్ధురాలు బావిలోదూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని దేశరాజుపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దేశరాజుపల్లి గ్రామానికి చెందిన ఈరుమల్ల బాలమ్మ(74) కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. వైద్యులు ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఆపరేషన్‌కు భయపడిన ఆమె శనివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త ఈరుమల్ల కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ముస్తాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడూర్ స్టేజి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలకేంద్రానికి చెందిన కూర సిద్ది రాములు(53) మృతిచెందాడు. సిద్దిరాములు తన ద్విచక్రవాహనంపై ముస్తాబాద్‌కు వస్తుండగా గూడూర్ స్టేజి వద్ద ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ గణేష్ పరిశీలించి మృతదేహన్ని పోస్టుమార్టం నిమ్తిం సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడిని ఢీకొట్టిన కారు

● అక్కడికక్కడే మృతి



కొమురయ్య(ఫైల్)

సుల్తానాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుకులలో రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న తాళ్లపల్లి కొమురయ్య (85) అనే వృద్ధుడిని ఆదివారం కారు ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కొమురయ్య అల్లుడు ఇల్లెందుల శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రామునిపల్లికి చెందిన తాళ్లపల్లి కొమురయ్య ప్రతీరోజు మధ్యాహ్నం, రాత్రి పూటభోజనం కోసం కనుకులలోని కూతురు ఇంటికి నడుచుకుంటూ వచ్చివెళ్తుండేవాడు. ఆదివారం మధ్యాహ్నం కూడా అలాగే నడుచుకుంటూ వస్తుండగా వెనక వైపు నుంచి కారు కొమురయ్యను ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలతో వృద్ధుడు అక్కడికక్కడే చనిపోయారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుబాయిలో ముత్యంపేట వాసి ఆత్మహత్య

● స్వగ్రామం చేరిన మృతదేహం



శ్రీనివాస్(ఫైల్)

మల్యాల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం ముత్యంపేట కొండ గట్టుకు చెందిన పంజాల శ్రీనివాస్‌గౌడ్(54) అనే వ్యక్తి ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి మూడు నెలలక్రితం ఆత్మహత్య చేసుకోగా ఆదివారం మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. శ్రీనివాస్‌గౌడ్ రెండేళ్ల క్రితం దుబాయి వెళ్లాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 21న ఆత్మహత్య చేసుకోవడంతో అక్కడి పోలీసులు మార్చురీలో భద్రపరిచారు. కంపెనీ వీసా కాకపోవడంతో మూడు నెలల గడిచినా ఆచూకీ లభించకపోగా ఫింగర్‌ప్రింట్స్ ఆధారంగా పది రోజుల క్రితం కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి అధ్యక్షుడు నర్సింహ దృష్టికి కూడా వెళ్లడంతో ఉపాధ్యక్షుడు శేఖర్‌గౌడ్ ద్వారా వివరాలు సేకరించారు. దుబాయిలో గల ప్రభాకర్ తదితరుల చొరవతో శ్రీనివాస్‌గౌడ్ మృతదేహం ఆదివారం స్వగ్రామం చేరుకుంది.

అడవిలో కలప దొంగలు

● యథేచ్ఛగా టేకు చెట్లు నరికివేత
● ఓబులాపూర్ అటవీ ప్రాంతంలో నిత్యకృత్యంగా కలప తరలింపు
● అధికారుల పర్యవేక్షణ కరువు



నరికివేయగా మిగిలిన చెట్టు మొదలు



నరివేయడంతో బోసిగా కనిపిస్తున్న టేకు చెట్ల మొదలు

మల్యాల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గతంలో రాష్ట్ర స్థాయిలో పేరొందిన ఓబులాపూర్ అటవీ ప్రాంతంలో ప్రస్తుతం కలపదొంగలు పెట్రేగిపోతున్నారు. యదేచ్ఛగా టేకుచెట్లను నరికివేస్తూ అక్రమంగా తరలిస్తున్నారని సమీప గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓగులాపూర్ గ్రామం అటవీ ప్రాంతం పచ్చని గుట్టల మధ్య ఉండగా ఇక్కడ దాదాపు 4,619 ఎకరాల పరిధిలో అటవీవిస్తీర్ణం ఉంది. సుమారు ఇరవై ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం వనసంరక్షణ సమితిలను ఏర్పాటు చేయగా ఇక్కడ కూడా గ్రామస్థులు సమష్టిగా వనం పెంపుకు కృషి చేశారు. ముఖ్యంగా టేకు వనం పెంచడంతో ఈప్రాంతంలో అటవీవిస్తీర్ణం పెరిగింది. అయితే కొన్నాళ్లుగా విచక్షణ రహితంగా ఇక్కడ టేకు వనాలను నరికి వేస్తున్నారు.

● ప్రతి నిత్యం అక్రమంగా తరలింపు

ఓబులాపూర్ అటవీప్రాంతం వేలాదిఎకరాల్లో పరచుకొని ఉండడంతో ఓబులాపూర్‌తో పాటు గొర్రెగుండం, ఒడ్యాడు తదితర ప్రాంతాల శివార్ల వరకు టేకు వనం ఉంది. అయితే కొందరు కలప దొంగలు నిత్యం టేకు కలపను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని పలువురు పేర్కొంటున్నారు. సంబంధిత అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, మొక్కుబడి పర్యవేక్షణలతో కలప తరలుతోందని ఓబులాపూర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఒడ్యాడు మార్గంలో కొన్నాళ్ల క్రితం వంట చెరకు పేరిట నరికివేసి తరలించడానికి సిద్ధంగా ఉంచిన కలపను పట్టుకొని నామమాత్రపు జరిమానాలు విధించారనే చర్చ జరిగింది. అటవీ ఉన్నతాధికారులు దృష్టిసారించి చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని, నిత్యం గస్తీకోసం చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు. ఈ విషయమై ఫారెస్ట్ బీట్ అధికారి వసీంను వివరణ కోరగా.. టేకు కలప నరికివేత ప్రదేశాలను గుర్తించి మరోసారి అలా జరుగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. టేకు కలప నరికిన వారిపై పలుమార్లు జరిమానాలు కూడా విధించడం జరిగిందని, టేకు కలప సంరక్షణకు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



జయ్యారంలో బోనాలతో మహిళలు

పాలకుర్తి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా మండలంలోని జయ్యారం గ్రామంలో గ్రామ దేవత పోచమ్మకు ఘనంగా బోనమెత్తారు. ఆదివారం గౌడ సామాజిక మహిళలు ప్రతీఇంటి నుంచి బోనం తయారుచేసుకొని డప్పు చప్పుళ్లతో ఆలయానికి తరలి వెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు.

భక్తులతో కిక్కిరిసిన మల్లన్న క్షేత్రం



మల్లన్న ఆలయంలో పట్నాలు వేస్తున్న భక్తులు

ఓదెల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం వేలాది మంది భక్తులతో కిక్కిరిసింది. రోహిణి కార్తె ప్రవేశంతో వ్యవసాయ పనులకు సిద్ధమయ్యే ముందు రైతన్నల కుటుంబాలు వేలాదిగా తరలివచ్చి మొక్కులను సమర్పించారు. అలాగే కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, మంచిర్యాల, వరంగల్, సిద్దిపేట తదితర జిల్లాల నుంచి వాహనాల్లో దాదాపు 20 వేల పైచిలుకు మంది భక్తులు జాతరకు తరలివచ్చి మల్లికార్జున స్వామి, మధన పోచమ్మ, బంగారు పోచమ్మలను దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయంలో కోడెలతో ప్రదక్షిణలు నిర్వహించారు. భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి, బోనాలతో మల్లన్నకు సమర్పించారు. క్యూ లైన్‌లో భక్తులు మూడు గంటల సమయం వరకు వేచి ఉండి మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి భక్తుల సంఖ్య అధికంగా పెరగడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. దీంతో భక్తులు బోనాలు సిద్ధం చేసేందుకు, సేదతీరేందుకు సరైన స్థల విస్తీర్ణం లేక భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఈయేడూ ఇక్కట్లేనా?

● రూ. 1.30 కోట్లు మంజూరైనా ప్రారంభం కాని రోడ్డు పనులు ● వెయ్యి మంది విద్యార్థులకు కష్టాలు



వర్షాకాలంలో నీటిలో నడుచుకుంటూ వెళుతున్న విద్యార్థులు(ఫైల్)

కథలాపూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మోడల్‌స్కూల్, ప్రభుత్వజూనియర్ కళాశాల, కస్తూర్బాగాంధీ పాఠశాలకు వెళ్లేందుకు ఉన్నది ఒకేఒక రోడ్డు. వర్షాలు కురిశాయంటే ఈ పాఠశాలల్లో చదివే సుమారు వెయ్యిమంది విద్యార్థుల బాధలు వర్ణణాతీతంగా ఉంటాయి. మోకాలి లోతు నీటిలో కళాశాల, పాఠశాలలకు వెళ్లి చదువుకోవాల్సిన దుస్థితి. పదేళ్లుగా ఎమ్మెల్యేలు, ఎంపీలకు అధ్యాపకులు, విద్యార్థులు అనేక వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకున్న పాపాన పోలేదు. రోడ్డుకు తాత్కాలికంగా మరమ్మతులు చేసినా వానలకు కొట్టుకుపోవడం సర్వసాధారణంగా మారింది. అయితే వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎంఆర్‌ఆర్ గ్రాంట్ కింద రోడ్డు నిర్మాణానికి రూ. 1.30 కోట్లు మంజూరుచేయించారు. నాలుగు మాసాల క్రితం శంఖుస్థాపన కూడా చేశారు. ఈ పనులు చేపట్టడానికి ఓ కాంట్రాక్టర్ ముందుకు వచ్చి అగ్రిమెంట్ చేసుకున్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పలుమార్లు రోడ్డును పరిశీలించినా పనులు ప్రారంభించడంలో విపరీత జాప్యం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామం పైభాగం నుంచి వచ్చే మురికినీటిని కూడా మళ్లించడానికి మురికి కాలువ కూడా ఇదే ప్యాకేజీలో తీసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి కస్తూర్బాగాంధీ పాఠశాల మీదుగా జూనియర్ కాలేజీ దాకా నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఈ కాలువ నిర్మాణం కోసం లెవెల్‌తీసి వదిలేశారు. ఈ క్రమంలో వర్షాలు కురుస్తున్నందువల్ల పనులకు ఆటంకం కలిగే పరిస్థితి నెలకొంది. వేసవి కాలంలోనే రోడ్డు, కల్వర్టుల నిర్మాణాలు పూర్తి చేయడంలో జాప్యం చేశారనే విమర్శలు వస్తున్నాయి.

కాంట్రాక్టర్ కంకర, ఇసుక, స్టీల్ వంటి సామగ్రి పనిప్రదేశంలో సిద్ధంగా ఉంచుకున్నప్పటికీ అధికారులు పనుల కొనసాగింపులో ఎందుకు తాత్సారం చేస్తున్నారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఈ ఏడాది కూడా తమకు నీటి కష్టాలు తప్పవని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

వ్యవసాయ బావిలో పడి ఒకరి గల్లంతు



పోచయ్య(ఫైల్)

ఎలిగేడు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపూర్‌గ్రామానికి చెందిన కాంపల్లి పోచయ్య(67)అనేవ్యక్తి వ్యవసాయబావిలో మునిగి ఆదివారం గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపినవివరాల మేరకు.. మధ్యాహ్న సమయంలో పోచయ్య తన మనుమడికి ఈత నేర్పేందుకు పొలిమేరల్లో ఉన్న వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. మనుమడిని బావి మీదనే ఉంచి పోచయ్య బావిలో దిగి ఈత కొడుతూ ఊపిరాడక కొన్ని నిమిషాల్లోనే నీటిలో మునిగిపోయాడు. పోచయ్య కని పించకపోవడంతో బావిపై ఉన్న మను మడు ఇతరులు కేకలు వేయడంతో అంద రు బావివద్దకు వచ్చారు. విషయాన్ని జూల పల్లి పోలీసులకు తెలపడంతో గల్లంతైన పోచయ్యను బయటకు తీసేందుకు విద్యుత్ మోటార్లు పెట్టి నీటిని తోడుతన్నారు.

8 వరకే శుభముహూర్తాలు

- జూన్ 9 నుంచి జూలై 25 వరకు ముహూర్తాలు లేవు
- తిరిగి ఆగస్టు వరకు ఆగాల్సిందే



కరీంనగర్ కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వివాహాది శుభకార్యాల నిర్వహణకు శుభముహూర్తాల కరువు ఏర్పడనుంది. ఈ నెలలో 8వ తేదీ వరకు మాత్రమే ముహూర్తాలు ఉన్నాయి. ఈ స్వల్ప వ్యవధిలోనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది సంఖ్యలో శుభకార్యాలు జరుగనున్నాయి. దీంతో పెళ్లి మండపాలు, పురోహితులు, బాజాభజంత్రీలు, ఈవెంట్స్ నిర్వాహకులు, వంటవారు, పూలు, అలంకరణలు, బట్టలు, బంగారం, కిరాణం వంటి వివిధ షాపుల వారికి గిరాకీ పెరగనుంది. ఆయా రంగాలకు చెందిన వ్యక్తులకు అడ్వాన్స్‌లు కూడా ముట్టాయి. అనంతరం ముహూర్తాల కోసం ఆగస్టు వరకు ఆగాల్సిందే 9వ తేదీ నుంచి గురు మౌఢ్యంతో పాటు జ్యేష్ఠ మాసం కావడంతో జూన్‌లో, ఆ తర్వాత జూన్ 26 నుంచి జూలై 24వ తేదీ వరకు ఆషాఢమాసం కారణంగా ముహూర్తాలు లేవు. జూలై 27వ తేదీ నుంచి ఆగస్టు 14వ తేదీ వరకు శ్రావణమాసంలో తిరిగి 29 రోజుల పాటు ముహూర్తాలున్నాయి. ఆగస్టు 24వ తేదీ నుంచి భాద్రపదమాసం, సెప్టెంబరు 22వ తేదీ నుంచి ఆశ్వయుజమాసం కారణంగా అక్టోబరు 21వ తేదీ వరకు ముహూర్తాలు లేవు. అక్టోబరు 24 నుంచి తిరిగి ముహూర్తాలు ఉన్నాయి.

ఫుల్ క్రేజీ.. బాస్కెట్ బాల్





- జిల్లాలో ఆదరణ ఉన్న ఆట
- శిక్షణ శిబిరాలకు పెద్ద సంఖ్యలో హాజరవుతున్న చిన్నారులు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బాస్కెట్‌బాల్ క్రీడకు జిల్లాలో మంచి ఆదరణ ఉంది. ఏటా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరాలకు చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. 2017, 2018లో జరిగిన శిబిరంలో 100 లోపు, 2019లో సుమారు 300 మంది, ప్రస్తుతం 200 మందికి పైగా చిన్నారులు శిక్షణ పొందుతున్నారు.

● ఆడే విధానం...

ప్రతి టీంలో 12 మంది క్రీడాకారులు ఉంటారు. వీరిలో ఏడుగురు సబ్‌స్టిట్యూట్‌లుగా ఉండగా, ఐదుగురు ఆట ఆడతారు. రెఫరీ ఆటను ప్రారంభించే ముందు రెండు టీంల మధ్య జంప్‌బాల్ ఎగురవేసి ఆటను ప్రారంభిస్తారు. లైన్ బయటి నుంచి గోల్ చేస్తే మూడు పాయింట్లు ఇస్తారు. రెండు పాయింట్ల జోన్ నుంచి వేస్తే రెండు పాయింట్లు ఇస్తారు. ఫ్రీ త్రో నుంచి వేస్తే ఒక్క పాయింట్ ఇస్తారు. ఇలా ఏ జట్టు ఎక్కువగా స్కోర్ సాధిస్తే దానిని విజేతగా నిర్ణయిస్తారు.



బాస్కెట్‌బాల్ ఆడుతున్న బాలికలు

శిక్షణ బాగుంది..

- సాత్విక



గతంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపులో స్విమ్మింగ్‌లో శిక్షణ తీసుకున్నా. ఇప్పుడు బాస్కెట్‌బాల్‌లో ట్రైనింగ్ తీసుకుంటున్నా. కోచ్‌లు బాగా శిక్షణ ఇస్తున్నారు.

జాతీయ స్థాయిలో ఆడాలని ఉంది..

- విఖ్యాత్



బాస్కెట్‌బాల్ గేమ్ అంటే చాలా ఇష్టం. స్కూల్‌లో కూడా ప్రాక్టీస్ చేస్తా. సమ్మర్ క్యాంపు ప్రారంభం నుంచి వస్తున్నా. గేమ్‌లో టెక్నిక్‌లు అన్నీ నేర్చుకుని రాష్ట్ర, జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనాలనేది లక్ష్యం.

గత సంవత్సరం నుంచి వస్తున్నా..

- స్వప్నిక



ప్రస్తుతం బాస్కెట్‌బాల్‌ను ఆడేందుకు చాలా మంది ఇష్టపడుతున్నారు. నేను గత సంవత్సరం పెట్టిన సమ్మర్ క్యాంపునకు కూడా వచ్చాను. మంచిగా ప్రాక్టీస్ చేసి బాస్కెట్‌బాల్‌గా చాంపియన్‌గా ఎదగాలని ఉంది.

వాటర్ ట్యాంక్ ఎక్కి యువకుడి ఆత్మహత్యాయత్నం

- కానిస్టేబుల్ కౌన్సెలింగ్‌తో కిందికి దిగిన యువకుడు

కరీంనగర్ క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం బావుపేటకు చెందిన పేరెళ్ల సన్ని అలియాస్ దయాసాగర్ ఆదివారం కుటుంబసభ్యులతో గొడవపడి వాటర్‌ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యకు యత్నించగా కానిస్టేబుల్ కౌన్సెలింగ్‌తో కిందికి దిగివచ్చాడు. పోలీసుల వివరాల ప్రకారం.. దయాసాగర్ ఆదివారం ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడి దాడికి దిగాడు. అనంతరం గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. డయల్ 100 ద్వారా కొత్తపల్లి పోలీసులకు విషయం తెలియగానే కానిస్టేబుల్ విజయరావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. దయాసాగర్‌తో మాట్లాడుతూ కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో యువకుడు కిందకు దిగి వచ్చాడు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ విజయరావును కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్, కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి అభినందించారు.

సువిశాలమైన గోశాల నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సూచించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామికి ఎంతో ప్రీతికరమైన కోడెల సంరక్షణ కోసం అత్యాధునిక వసతులతో, సువిశాలమైన నూతన గోశాల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించినట్లు ప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల ఖతర్ పర్యటన ముగించుకొని రాష్ట్రానికి తిరిగి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వేములవాడ అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ఇటీవల రూ.200కోట్లతో వేములవాడ నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు చేయడంపై, ఇటీవల ఏఐసీసీ ప్రకటించిన కమిటీల్లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ, డీలిమిటేషన్ కమిటీ సభ్యులుగా నియమించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఖతర్ పర్యటన వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. రాజన్న ఆలయంలో జరగబోవు అభివృద్ధి, గోశాలలో జరుగుతున్న పలు అంశాలపై ముఖ్యమంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారనారు. గోశాలలోని కోడెలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, అత్యాధునిక వసతులతో సువిశాలమైన స్థలంలో నూతన గోశాల నిర్మాణం కోసం స్థలసేకరణ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారని, కోడెలు మృతిచెందడం బాధాకరమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, కోడెలు అనారోగ్య బారినపడకుండా ప్రభుత్వం, ఆలయం తరపున జాగ్రత్తల తీసుకుంటామని వివరించారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

నిరుపేద విద్యార్థులకు అండగా కపిల్ 'విద్యావారధి'

- పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల పైచదువులకు సహకారం

భగత్‌నగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు సంక్షేమ చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో సువర్ణ అవకాశం కల్పిస్తున్నట్లు ట్రస్ట్ ఉపాధ్యక్షుడు అప్పిడి రాజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులులేని, నిరుపేద, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన, 470పై మార్కులు సాధించిన విద్యార్థులకు వారు స్థిరపడే వరకు ఏ కోర్సు చేసినా ఆయ్యే ఖర్చులను కపిల్ విద్యావారధి భరిస్తుందన్నారు. ఇందుకు ఈనెల8న అర్హతపరీక్ష ఉంటుందన్నారు. ఉమ్మడి కరీంనగర్‌జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా ట్రస్ట్‌ఈఅవకాశాన్ని కల్పిస్తుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు కపిల్ విద్యావారధి ఆర్గనైజేషన్‌ద్వారా ఆన్‌లైన్‌లో జూన్5వతేదీవరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్8న కరీంనగర్‌లో అర్హతపరీక్ష ఉంటుంద న్నారు. ఈ అవకాశాన్ని పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఫిజికల్ డైరెక్టర్ మృతి



కదారి రవి(ఫైల్)

కరీంనగర్ స్పోర్ట్స్/పెద్దపల్లి కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ కదారి రవి(57) ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. హైదరాబాద్‌కు తనకారులో వెళ్తుండగా సిద్దిపేట జిల్లా కొమురవెల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో కారుటైరు పగిలి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న రవికి తీవ్రగాయాలయ్యాయి.వెంటనే సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. కదారి రవి ప్రస్తుతం పెద్దపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా, వ్యాయామ విద్య ఉపాధ్యా య రీసోర్స్ పర్సన్‌గా కొనసాగుతున్నారు. ఉమ్మడి జిల్లా అథ్లెటిక్ క్రీడాకా రుడిగా జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయి పోటీల్లో రాణించారు.

● పూర్వ విద్యార్థుల సమ్మేళనం సంతాప సభగా...

దోమలగూడలోని ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల (1991) పూర్వ విద్యార్థుల సమ్మేళనం, జింఖానా గ్రౌండ్స్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్ పోటీలకు వెళ్లేందుకు ఆదివారం ఉదయం కరీంనగర్ నుంచి బయల్దేరిన రవి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం రవి సంతాప సభగా మారింది.

● పలువురి సంతాపం

కదారి రవి మృతితో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు క్రీడారంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల డీవైఎస్‌వోలు శ్రీనివాస్‌గౌడ్, సురేష్, రాందాస్, రవి, ఉమ్మడి జిల్లా ఒలంపిక్‌సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షులు తుమ్మల రమేశ్ రెడ్డి, మహ్మద్ కరీం, నాగిరెడ్డి సిద్ధారెడ్డి, కరీంనగర్, పెద్దపల్లిజిల్లాల పీఈటీల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు అంతటి శంకరయ్య,శ్రీనివాస్, బాబుశ్రీనివాస్,ఆడెపు శ్రీనివాస్, వేల్పుల సురేందర్, దాసరి రమేశ్ తదితరులు సంతాపం తెలిపారు.

● పెద్దపల్లి డీఈవో మాధవి, మండల విద్యాధికారి సురేందర్, ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేందర్ కరీంనగర్‌లోనివాళులర్పించారు.

భక్తజన సంద్రంగా మారిన రాజన్న ఆలయం

- 70 వేలకు పైగా రాజన్నను దర్శించుకున్న భక్తులు..
- రాజన్న దర్శనానికి నాలుగు గంటల సమయం..



రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం ఆదివారం భక్త జనసంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజన్న ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మ దర్శనం, కోడె మొక్కు. క్యూలైలో భక్తులు సుమారు నాలుగు గంటలకు ఆలయంలోకి చేరుకొని శ్రీపార్వతి రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నకు ఇష్టమైన కోడె మొక్కు. చెల్లించుకున్నారు. అనుబంధాలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామిని 70 వేల మంది వరకు భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అత్యాధునిక గోశాలల ఏర్పాటు హర్షణీయం

కరీంనగర్ అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యాధునిక సౌకర్యాలతో 50ఎకరాల విస్తీర్ణంలో గోశాలలను ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై కరీంనగర్ జీవకారుణ్య సమితి ఉమ్మడి జిల్లా కార్యదర్శి, న్యాయవాది డాక్టర్ జి కొమురయ్య హర్షం వ్యక్తం చేశారు. జీవకారుణ్య సమితి తరపున సీఎంకు అభినందనలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతిజిల్లాలో అత్యాధునిక సౌకర్యాలతో 50ఎకరాలలో గోశాలలను ఏర్పాటు చేసి గోవుల ద్వారా సమకూరే పేడ, గోమూత్రం రైతులకు అందించి సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కొమురయ్య కోరారు.

నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాల విక్రయం

హుజూరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు గోస్కుల అజయ్ అన్నారు. ఆదివారం హుజూరా బాద్‌లో ఆయన మాట్లాడుతూ హుజూరాబాద్‌లోని పలుప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, నోట్‌పుస్తకాలు, టై, బెల్ట్‌లు అమ్ముతున్నారన్నారు. పుస్తకాల విక్రయం ఆపకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ సమస్యపై విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలను సీజ్ చేయాలన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశమైన విశ్రాంత ఉద్యోగులు

భగత్‌నగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని బీజేపీ విశ్రాంత ఉపాధ్యాయ, ఉద్యోగ, రాష్ట్ర సెల్ కో-చైర్మన్ నరహరి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో నిర్వహించిన విశ్రాంతఉద్యోగుల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లాగానే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పీఆర్సీ, డీఏలు ఇవ్వడం లేదని, రిటైర్‌మెంట్ అయిన వారికి పెన్షన్, జీపీఎఫ్ డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదంటూ న్యాయమైన సమస్యలను పరిష్కరించక పోవడం శోచనీయమన్నారు. ఉద్యోగులు ప్రభుత్వాన్ని కొత్త కోరికలు కోరడం లేదని, భేషజాలకు పోకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా సెల్ నాయకులు గంట్ల నర్సింహారెడ్డి, కర్ర ప్రభాకర్‌రెడ్డి, గోలి సత్యనారాయణరెడ్డి, పింగిలి ప్రతాపరెడ్డి, అబ్బిడి మాధవరెడ్డి, ఈరెడ్డి తిరుమలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజన్న కోడెల సంరక్షణకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- పశు వైద్యాధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు, చికిత్సలు
- జీవాలకు మెరుగైన దాణా, పచ్చిగడ్డి ఇచ్చేలా ప్రణాళిక
- 32 మందికి రెండు చొప్పున 64 కోడెల పంపిణీ



కోడెలను అందిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అధికారులు

వేములవాడ కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి కోడెల సంరక్షణకు పకడ్బందీగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. వేములవాడ పరిధిలోని తిప్పాపూర్‌లో ఉన్న వేములవాడ శ్రీరాజేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన గోశాలలోని 32 జతల కోడె పిల్లలను అర్హులైన రైతులకు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోశాల ఆవరణలో మొత్తం పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సలహాలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ కోడె పిల్లలను పొందిన రైతులు వాటి సంరక్షణ బాధ్యతను పక్కాగా చూడాలని సూచించారు. వాటి నిర్వహణ తదితర అంశాల్లో ఏమైనా పక్కదారి పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గోశాల ఆవరణలో లోతుగా ఉన్న స్థలంలో మట్టిని పోయిస్తూ చదును చేస్తున్నామని తెలిపారు. కోడెలకు మెరుగైన దాణా, పచ్చిగడ్డి అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశామని వాటిని అందిస్తున్నామని వివరించారు. పశువైద్యాధికారుల బృందంతో జీవాలకు వైద్యం అందిస్తూ పర్యవేక్షిస్తున్నామని స్పష్టం చేశారు. హాజరైన ఆర్డీఓ రాధాభాయి, వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, ఈఓ వినోద్ రెడ్డి, తహశీల్దార్ విజయ ప్రకాష్ రావు, మున్సిపల్ కమీషనర్ అన్వేష్, తదితరులు ఉన్నారు.

● నాలుగు రాజన్న కోడెలు మృతి..

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి తిప్పాపూర్ గోశాలలో ఆదవారం ఉదయం నాలుగు కోడలు అనారోగ్యంతో మృతిచెందాయి. ఘోశాలలో అనారోగ్యంతో కొట్టుమిట్టాడుతున్న కోడెలు మృతిచెందాయి. మృతిచెందిన కోడెలను ట్రాక్టర్‌లో తరలించి మూలవాగులో ఖననం చేశారు.



కోడెలను అందుకున్న రైతులు

రాజన్న కోడెలకు వైద్య శిబిరం

- 500 పశువులకు ఎల్ఎస్‌డీ వ్యాక్సినేషన్
- అనారోగ్యం బారిన పడిన 16కోడెలకు చికిత్స
- అకాల వర్షాలు, అనారోగ్యంతో 17 కోడెల మృతి
- కోడెలు ఆరోగ్యంగా అయ్యే వరకు వైద్యం
- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి

సిరిసిల్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన తిప్పాపూర్‌లోని గోశాలలోని కోడెల రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టామని, కోడెలు పూర్తిగా ఆరోగ్యంగా అయ్యే వరకు వైద్య శిబిరం నిర్వహిస్తామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం గోశాలలోని కోడెల విషయమై హెల్త్ బులిటెన్‌ను విడుదల చేశారు. అకాల వర్షాలు, అనారోగ్య పరిస్థితుల వల్ల వేములవాడ తిప్పాపూర్‌లోని గోశాలలో 8 కోడెలు మొదటగా మరణించగా, జిల్లా యంత్రాంగం అప్రమత్తమై ఐదుగురు పశువైద్య డాక్టర్లతో కూడిన 12 మంది బృందం గోశాలలోని పశువులను పరిశీలించిందన్నారు. రెండో రోజు అనారోగ్య కారణాలతో మరో ఐదు కోడెలు మరణించాయని పేర్కొన్నారు. కలెక్టర్ అధ్యక్షతన కోడెల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించి 500 పశువులకు ఎల్ఎస్‌డీ వ్యాక్సిన్ వేశామని, అనారోగ్యంతో ఉన్న 20 పశువులకు ప్రత్యేక చికిత్స అందించి, వాటిలో 16 పశువులను రక్షించామని తెలిపారు. మరో నాలుగు కోడెలు మరణించాయని తెలిపారు. గోశాలలో ఇప్పటివరకు 17కోడెలు అనారోగ్య పరిస్థితులతో మరణించాయని, మిగిలిన పశువులు ఆరోగ్యంగా ఉన్నాయని తెలిపారు. 64 కోడెలను స్థానిక రైతులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.



ఆర్జీ-2 ఉత్తమ ఉద్యోగుల ఎంపిక



నరసింహారావు, బుర్ర రమేష్

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ వేడుక ల్లో భాగంగా అన్ని ఏరియాల్లో ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసి సన్మానించ నున్నది. దీనిలో భాగంగా ఆర్జీ-2 ఏరియా ఉత్తమ ఉద్యోగులుగా ఎం నరసిం హారావు, బుర్ర రమేష్‌ను యాజమాన్యం ఎంపిక చేసింది. ఆర్జీ-2 ఏరియా ఇంజనీర్ విధులు నిర్వహిస్తున్న నరసింహారావు కొత్తగూడెంలో జరిగే ప్రధాన ఉత్సవంలో సీఎండీ చేతుల మీదుగా సన్మానం పొందనున్నారు. ఓసీపీ-3 సీహెచ్‌పీలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న బుర్ర రమేష్ ఆర్జీ-2 ఏరియా ఉత్సవంలో జీఎం వెంకటయ్య చేతుల మీదుగా సన్మానం పొందనున్నారు.

● ఆర్జీ-3 ఏరియాలో..

రామగిరి: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్జీ-3, ఏపీఏ డివిజన్లలో ఉత్తమ ఉద్యోగుల ఎంపిక చేసినట్లు అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీపీ-2 నుంచి డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ వేముల అశోక్, ఏఎల్‌పీ నుంచి డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్‌కె హుస్సేన్ ఎంపికయ్యారు. వీరు కొత్తగూడేంలో సత్కారం అందుకోనున్నారు. ఏరియా స్థాయిలో ఓసీపీ-1 ఈపీ ఆపరేటర్ తాటి కొండ శ్రీనివాస్, ఏఎల్‌పీ గని నుంచి మల్టీజాబ్ వర్కర్ వెంకటేశం స్థానిక రాణిరుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో సత్కారం అందుకుంటారు.

నేడు తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

గోదావరిఖని, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో సోమవారం తెలంగాణ ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నట్టు ఆర్‌జీ-1 అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు జాతీయ పతక ఆవిష్కరణ, జీఎం ఆఫీస్ నుంచి చౌరస్తా, చౌరస్తా నుంచి జీఎం కార్యాలయం వరకు తెలంగాణ రన్ నిర్వహించనున్నట్టు తెలిపారు. సాయంత్రం ఆరు గంటల నుంచి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఉత్తమ ఉద్యోగుల సన్మానం, ముఖ్య అతిథుల సందేశం, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తూ ముందుకు..

- పెరిగిన లక్ష్యాలకు అనుగుణంగా కార్యాచరణ - సింగరేణిలో రెండు ఓసీపీలకు అనుమతి - నైనీ బ్లాక్‌లో ఉత్పత్తి ప్రారంభం - వంద మిలియన్ టన్నుల వైపు అడుగులు



గోదావరిఖని, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి మూల ఇంధనమైన బొగ్గును అందజేసే సింగరేణి సంస్థ యేటేటా ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తూ ముందుకు సాగుతోంది. గతేడాది 72మిలియన్ టన్నుల లక్ష్యాన్ని అధిగమించిన సింగరేణి 2025-26 ఆర్థిక సంవత్సరంలో 76 మిలియన్ టన్నుల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. 2030వరకు వంద మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు ఇప్పటి నుంచే యేటా ఐదు నుంచి ఏడు మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని పెంచుకుంటూ దీర్ఘకాలిక ప్రణాళికలను అమలు చేస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పెంచుకున్న 4మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసేందుకు కార్యాచరణకు దిగింది. గత నెలలో ఒడిశాలోని నైనీ బ్లాక్‌ను ప్రారంభించుకున్న సింగరేణి అక్కడి ఓసీపీ నుంచి ఇదే సంవత్సరం మూడు నుంచి నాలుగు మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించేందుకు పనులు మొదలుపెట్టింది. నైనీబ్లాక్ పూర్తిస్థాయిలో ఉత్పత్తిలోకి వస్తే సంవత్సరానికి పది మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేస్తుంది. 340 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్న నైనీ బ్లాక్ మొత్తం సింగరేణి ఉత్పత్తిలో 10శాతానికి పైబడి బొగ్గు అందించనున్నది. దీనికి తోడు నైనీ బ్లాక్‌లో నాణ్యమైన ఏ, బీ, సీ గ్రేడ్‌ల బొగ్గు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. ఇక కొత్తగూడెం వీకే7 గనికి కూడా పూర్తి స్థాయి అనుమతులు వచ్చాయి. వీలైనంత తొందరలో వీకే 7 నుంచి కూడా బొగ్గు ఉత్పత్తి చేసేందుకు సింగరేణి యాజమాన్యం ప్రణాళికలు చేస్తున్నది. ఇల్లందులోని జేకే ఓపెన్‌కాస్టుకు సైతం నాలుగు రోజుల క్రితమే పూర్తి స్థాయి అనుమతులు వచ్చాయి. పర్యావరణ అనుమతికి కూడా జేకే ఓసీపీకి లభించింది. నైనీ బ్లాక్‌తో పాటు వీకే7, జేకే ఓసీలు ఇదే ఆర్థిక సంవత్సరం ఉత్పత్తిలోకి రానున్నాయి. గోలేటీ ఓసీపీ సైతం బొగ్గు ఉత్పత్తి చేయనున్నది. ఇప్పటికే 19ఓసీపీలు, 21 అండర్ గ్రౌండ్ గనులతో బొగ్గు ఉత్పత్తి చేస్తున్న సింగరేణిలో ఈ మూడు ప్రధానమైన ఓపెన్‌కాస్టులు ఉత్పత్తిలోకి రావడంతో 76 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని కూడా సింగరేణి అధిగమించే అవకాశాలున్నాయి.

● విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంచుకునేలా..

బొగ్గు ఉత్పత్తిలోనే కూడా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునేందుకు సింగరేణి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటుంది. ఇప్పటికే జైపూర్ ఎస్‌టీపీపీ నుంచి 1200 మెగావాట్ల ఉత్పత్తి చేస్తున్న సింగరేణి ఈ ఆర్థిక సంవత్సరం 800మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి యూనిట్‌ను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నది. ఈ మధ్యనే రాజస్థాన్ ప్రభుత్వంతో కూడా విద్యుత్ ఉత్పత్తి ఒప్పందం చేస్తున్నది. 1,500మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తితో పాటు 1,600 మెగావాట్లను ఉత్పత్తి చేసేందుకు ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకున్నది. ఇప్పటికే సింగరేణిలో సోలార్ ద్వారా 250మెగావాట్ల ఉత్పత్తి జరుగుతుంది. వీటన్నింటికి తోడు రామగుండం మేడిపల్లి ఓపెన్‌కాస్టులో 500 మెగావాట్ల సంప్‌డ్ స్టోరేజీ విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు కార్యాచరణ ప్రారంభించింది.

ఇటు బొగ్గు ఉత్పత్తి, అటు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాలను ఒకేసారి ముందుకు తీసుకెళ్లేందుకు సింగరేణి యాజమాన్యం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నది. ఒకే సంవత్సరంలో విద్యుత్ ప్లాంట్లు, ఓపెన్ కాస్టు ప్రాజెక్టులను ప్రారంభించుకుని, ప్రణాళికలు చేసుకొంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సుమారు ఆరువేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంచుకునేందుకు అడుగులు వేయడంతో పాటు 80 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సామర్థ్యానికి చేరే విధంగా ముందుకు నడుస్తున్నది. ఇప్పటికే సంవత్సరానికి నాలుగువేల కోట్ల రూపాయల నికర లాభాలు ఆర్జిస్తున్న సింగరేణి బొగ్గు, విద్యుత్ ఉత్పత్తి పెంచుకోవడం వల్ల భారీ లాభాలను ఆర్జించేందుకు ప్రణాళికలు రచిస్తున్నది.

ముమ్మరంగా రోడ్ల విస్తరణ

(3వ పేజీ తరువాయి)


కళాణ్‌నగర్ జంక్షన్‌లో భవనాన్ని కూల్చివేస్తున్న అధికారులు

హోల్‌సేల్ బజార్, హార్డ్‌వేర్ బజార్లు కూడా ఈ ప్రాంతంలోనే ఉండడంతో భారీ వాహనాలు వస్తుంటాయి. ఈ పరిస్థితుల్లో కళ్యాణ్‌నగర్ జంక్షన్‌లోని మూడు వైపులా భవనాలను తొలగిస్తున్నారు. అలాగే ఉల్లిగడ్డల బజార్‌కు 40 అడుగుల మార్కింగ్ ఇస్తున్నారు. పాపులర్ షూమార్ట్ -అజయ్ మెడికల్ స్టోర్ రహదారి విస్తరణ పూర్తయ్యింది. క్యాస శ్రీనివాస్ ఆసుపత్రి నుంచి గణేష్‌నగర్ బోర్డు వరకు కూడా విస్తరణ జరిగింది. గోదావరిఖని మున్సిపల్ కూరగాయాల మార్కెట్‌ను రెండు కోట్ల రూపాయలతో ఆధునికీకరిస్తున్నారు. హోల్‌సేల్ మార్కెట్‌కు కూరగాయలు తీసుకువచ్చే వాహనాలకు రోడ్డు ఇరుకుగా ఉండి ఇబ్బందులు ఏర్పడుతుండడంతో ఆ రహదారి సైతం విస్తరిస్తున్నారు.

● ఒత్తిళ్లు, అడ్డంకులను అధిగమిస్తూ..

ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్ నుంచి మేడిపల్లి గ్రామం వరకు మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగులుగా రోడ్డుగా ఉంది. దానిని ఆ మేరకు విస్తరిస్తున్నారు. గతంలో సింగరేణి సంస్థ ఓసీపీ-4 నుంచి బొగ్గు రవాణా కోసం 100అడుగుల రహదారి నిర్మాణానికి భూ సేకరణ జరిపింది. తరువాత మున్సిపల్ రహదారి నిర్మాణానికి అప్పగించారు. కాగా ఈ రహదారిలో ఆక్రమణలు జరిగాయి. ఈ ప్రాంతంలో కాలనీలు పెరగడం, జనసాంద్రత ఎక్కువగా ఉండడంతో ఈ రహదారిని విస్తరిస్తున్నారు. 80అడుగులకు మార్కింగ్ చేసి విస్తరణ పనులు మొదలు పెట్టారు. అలాగే ఎన్టీపీసీ రాజీవ్ రహదారి నుంచి మల్కాపూర్ రహదారిని సైతం విస్తరిస్తున్నారు. ఈ రహదారిలో నిర్మాణానికి కార్పొరేషన్ రెండు కోట్ల రూపాయలు కేటాయించి టెండర్లు కూడా ఖరారు చేసింది. ఇటీవల కృష్ణనగర్ రహదారి నిర్మాణానికి కూడా మరో రెండు కోట్ల రూపాయలు కేటాయించారు. మేడిపల్లి రహదారి విస్తరణ తరువాత కొత్తగా రహదారి నిర్మాణం జరిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ రహదారుల విస్తరణలో నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారు. కలెక్టర్ ప్రత్యేకాధికారిగా ఉండడం, అదనపు కలెక్టర్ కమిషనర్‌గా ఉండడంతో రహదారుల విస్తరణల్లో ఒత్తిళ్లను, అడ్డంకులను అధిగమిస్తున్నారు. కొన్నికొన్ని సందర్భాల్లో దూకుడుగానూ వ్యవహరిస్తున్నారు.

మెరుగైన వైద్యం అందించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం

- 4న కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్ ఎదుట దీక్ష - టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తమ రక్తాన్ని చెమటగా మార్చి ఈ దేశానికి వెలుగులు అందిస్తున్న సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్యం అందించ డంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక చౌరస్తాలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి హాస్పిటల్స్‌లో నిపుణులైన వైద్యులను నియమించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. నిత్యం ప్రమాదాలు జరిగి కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నా వాటి నివారణకు చర్యలు తీసుకోకుండా నామమాత్రపు వైద్యం అందించి ప్రాణాల మీదకు వచ్చిన తర్వాత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కి పంపిస్తున్నారని ఆరోపించారు. సింగరేణి హాస్పిటల్స్‌లో నిపుణులైన వైద్యులు అందుబాటులో లేని కారణంగా కార్మికులు వారి కుటుంబాలు ప్రైవేట్ హాస్పిటల్‌లను ఆశ్రయిస్తూ ఆర్థికంగా చితికిపోతున్నారన్నారు. సింగరేణిలో ప్రధానమైన రామగుండం హాస్పిటల్‌లో నిపుణులైన వైద్యులు అందుబాటులో లేరంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు. వైద్యం కోసం వచ్చిన వారికి సరైన మందులు ఇవ్వడం లేదని, లోకల్ పర్చేస్‌లో తెప్పించడం లేదని, ఫలితంగా కార్మికులు వారి కుటుంబాలు తిరిగి తిరిగి వేసారి ప్రైవేట్‌గా మందులు కొనుక్కుంటున్నారన్నారు. అనేక సార్లు యాజమాన్యానికి విన్నవించినా పరిస్థితిలో మార్పు రాకపోవడం విచారకరమని వాపోయారు. రూ.30వేల కోట్ల వార్షిక ఆదాయం కలిగిన సింగరేణి సంస్థ తన ఉద్యోగుల కోసం అన్ని సౌకర్యాలు కల్గిన హాస్పిటల్‌ను నిర్మించక పోవడం బాధాకరమన్నారు. యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ జూన్ 4న కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్ ఎదుట తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో దీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో నాయకులు నూన కొమురయ్య, పర్లపల్లి రవి, వడ్డేపల్లి శంకర్, లావుడ్య వెంకటేష్, సంపత్‌రెడ్డి, చెల్కలపల్లి శ్రీనివాస్, మోదుంపెల్లి రాజేశం, కోండ్ర అంజయ్య, సురేందర్, మీస రాజు, జోసఫ్, రవి, గడ్డి శ్రీనివాస్ అఫ్జర్ పాషా, రహ్మాన్, సాయి చరణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఓపెన్ మార్కెట్‌లో మిగులు విద్యుత్ విక్రయం

గోదావరిఖని, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద నిర్మించిన 1,200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి ఉత్పత్తి జరిగే విద్యుత్‌లో రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయగా మిగిలిన విద్యుత్‌ను ఓపెన్ మార్కెట్‌లో అమ్ముకునే ప్రక్రియను కొత్తగూడెం ప్రధాన కార్యాలయం నుంచి శనివారం సాయంత్రం సంస్థ సీఎండీ ఎన్ బలరాం ప్రారంభించారు. సింగరేణి సంస్థ ఏటా 1200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుండగా దీనిలో ఎక్కువ భాగం రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఇంకా మిగిలిన విద్యుత్తును దేశవ్యాప్తంగా ఇంధన అవసరం ఉన్న రాష్ట్రాలకు, సంస్థలకు బహిరంగ విపణిలో విక్రయించటానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి, ఉపముఖ్య మంత్రి, ఇంధనశాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు అనుమతి ఇచ్చారని, ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ ద్వారా అమ్మకాలు జరపనున్నామని సీఎండీ వెల్లడించారు. దీని వల్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి ఉత్పత్తి అవుతున్న మొత్తం విద్యుత్ ద్వారా దేశ ఇంధన అవసరాలను తీర్చడమే కాకుండా విద్యుత్ అమ్మకాలు జరిగి సంస్థకు కూడా లాభం చేకూరుతుందని, ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ కింద తమ మిగులు విద్యుత్తును అమ్ముకోవడానికి అంగీకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు డీ సత్యనారాయణరావు, ఎల్‌వీ సూర్యనారాయణ, కే వెంకటేశ్వర్లు, ఈడీ కోల్ మూమెంట్ ఎస్‌డీ ఎం సుభాని, ఈడీ ఎన్‌టీపీసీ చిరంజీవులు, జీఎం సీపీపీ మనోహర్, జీఎం మార్కెటింగ్ ఎస్‌వీ రాజశేఖర్‌రావు, కార్పొరేట్ జీఎంలు, అన్ని ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.

చలో కొత్తగూడెంను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐ కృష్ణ

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సింగేణిలో పనిచేస్తున్న సులబ్ కాంప్లెక్స్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 5న కొత్తగూడెం హెడాఫీస్ ఎదుట ధర్నాను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక యూనియన్ ఆఫీస్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సులబ్ కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు, పీఎఫ్, ఈఎస్ఐ, వైద్య సౌకర్యం, కల్పించాల్సి ఉన్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని తెలిపారు.

సులబ్ ఇంటర్నేషన్ సంస్థ పేరు చెప్పి యాజమాన్యం తప్పించుకుకోవాలని చూడడం సరికాదని అన్నారు. సులబ్ ఇంటర్నేషనల్ కూడా లాభార్జనే ధ్యేయంగా పని చేస్తూ కార్మికులను పట్టించుకోవడం లేదని కృష్ణ తెలిపారు. సులబ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎఫ్‌టీయూ అనేక సార్లు ఆందోళనలు చేసి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్ళినా స్పందన లేకుండా పోయినట్టు ఆయన తెలిపారు. జూన్ 5న ధర్నాకు పిలుపునిచ్చినట్టు కృష్ణ తెలిపారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం సులబ్ ఇంటర్నేషనల్ సంస్థపై ఒత్తిడి తేవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఈ నరేష్, బీ అశోక్, రాజేశం, శారద, బండ పద్మ, లింగయ్య, చంద్రన్న పాల్గొన్నారు.

ఆర్జీ-3 ఏరియాలో వంద శాతం ఉత్పత్తి

రామగిరి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో మే నెల ఉత్పత్తి వివరాలను ఆదివారం జీఎం నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో వెల్లడించారు.

సింగరేణి సంస్థ మే నెలలో ఏరియాకు నిర్ధేశించిన 5.75 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 5.76 లక్షల టన్నులు సాధించి 100 శాతంలో నిలిచిందని పేర్కొన్నారు. అదే విధంగా ఏపీఏ డివిజన్ పరిధిలోని లాంగ్‌వాల్ ప్రాజెక్టుకు నిర్దేశించిన 0.13 లక్షల టన్నులకు గాను 85 శాతం ఉత్పత్తిని సాధించినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సమష్టిగా కృషి చేసి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.

విద్యార్థుల యూనిఫామ్స్ సిద్ధం

(3వ పేజీ తరువాయి)


తుర్కలమద్దికుంటలో యూనిఫాం కుట్టే క్లస్టర్‌ను పరిశీలిస్తున్న ఏపీఎం సంపత్, అధికారులు (ఫైల్)

యూనిఫాం కుట్టే బాధ్యత అప్పగించడంతో యూనిఫాంలను అందించే పనిలో పడ్డారు. ఈనెల 12న పాఠశాలలు ప్రారంభమవుతున్న దృష్ట్యా అంతకుముందే పాఠశాలలకు యూనిఫాంలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించనున్నట్లు ఏపీఎం సంపత్ తెలిపారు. మహిళలు యూనిఫాంలను సమయంలోగా అందించేందుకు మహిళా సంఘాల సభ్యులు పనిలో నిమగ్నమయ్యారు.

● అధికారుల పర్యవేక్షణ..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు యూనిఫాంలను త్వరగా అందించేందుకు మండల ఏపీఎం సంపత్, సీసీలు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. రోజూ ఆయా కేంద్రాలకు వెళ్లి దుస్తులను సిద్ధం చేసే పనులను పర్యవేక్షించడంతోపాటు దుస్తులు సిద్ధం చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోగా దుస్తులు అందించాలని సంబంధిత మహిళ సంఘాల సభ్యులకు ఆదేశాలిస్తున్నారు.

● త్వరలోనే పాఠశాలలకు అందిస్తాం

- ఏపీఎం సంపత్, పెద్దపల్లి మండలం



మండలంలోని 30 గ్రామాల్లోని 54 పాఠశాలల విద్యార్థుల దుస్తులను పాఠశాలలు ప్రారంభం కాకముందే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందిస్తాం. అధికారులు ఆదేశించిన విధంగా దుస్తులు అందిచేందుకు నిరంతరం పర్యవేక్షిస్తూ యూనిఫాంలు సిద్ధమయ్యే విధంగా చర్యలు చేపడుతున్నాం.

● ఆర్థికంగా ముందుకు సాగుతున్నాం

- రాజ మంజుల, భోజన్నపేట, మహిళ సంఘ సభ్యురాలు



ప్రభుత్వం నుంచి బ్యాంకు లింకేజీతోపాటు స్త్రీనిధి రుణాలు పొందుతున్నాం. వాటి ద్వారా చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా ముందుకు సాగుతున్నాం. విద్యార్థులకు అవసరమైన యూనిఫాం కుట్టించే బాధ్యతను ప్రభుత్వం అప్పగించడంతో అదనపు ఉపాధి లభించింది.


వాకర్స్ అసోసియేషన్ కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం

మంథని, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ వాకర్ అసోసియేషన్ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. కుటుంబ సభ్యుల పరిచయాలు, ఆట పాటలతో సరదగా గడిపారు. సామూహిక భోజనాలు చేశారు. కాళేశ్వరంలో సరస్వతీ నది పుష్కరాలలో కమిటీ సభ్యుడిగా మంథని ప్రాంత భక్తులకు సేవలందించిన అవధాని మోహన్‌శర్మను శాలువాతో సన్మానించారు. వాకింగ్ వలన కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్, వాకర్స్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కాల్వశ్రీరాంపూర్‌లో ఒక చోట కలిసిన పూర్వ విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్/కమాన్‌పూర్/కోల్‌సిటీటౌన్/యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 1 ఆంధ్రజ్యోతి): కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1996-97వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. కమాన్‌పూర్ మండల కేంద్రంలోని మూర్తి విద్యాలయంలో 2001-02 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, గోదావరిఖనిలోని వాణీ విద్యావిహార్ పాఠశాలకు చెందిన 1999-2000, గీతాంజలి హైస్కూల్ 2003-04 పదోతరగతి, రాజరాజేశ్వర హైస్కూల్ 1999-2000 బ్యాచ్ పూర్వవిద్యార్థులు, యైటింక్లయిన్‌కాలనీలోని స్పందన హైస్కూల్ 2007-08 బ్యాచ్, శ్రీవాణి విద్యానికేతన్‌లో 2006-07 బ్యాచ్ పదవతరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.


ఖనిలోని వాణీవిద్యావిహార్ పాఠశాల పూర్వ విద్యార్థులు



కమాన్‌పూర్‌లో..

మలిదశ తెలంగాణ ఉద్యమంలో తెగువ చూపిన '8ఇంక్లయిన్‌కాలనీ'

నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం


ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఏర్పాటుకల సాకరమై పదకొండు ఏళ్లు గడిచాయి. యావత్ తెలంగాణ సంబరాలు జరుపుకుంటున్నది. ఈ సందర్భంగా 8ఇంక్లయిన్‌కాలనీలో ఉద్యమం గుర్తుచేసుకుంటూ... రాష్ట్ర సాధనే ధ్యేయంగా కొనసాగిన మలిదశ తెలంగాణ ఉద్యమంలో 8ఇంక్లయిన్ కాలనీ ప్రజలు పోరాట స్ఫూర్తితో ఉద్యమంలో మమేకమయ్యారు. 2009లో కాలనీలో నాన్‌పొలిటికల్ జేఏసీ ఏర్పడింది. ఈజేఏసీ ఆధ్వర్యంలో 100రోజుల పాటు ఆందోళనలు జరిగాయి. రాష్ట్ర ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరిస్తున్నట్టు కేంద్రం ప్రకటించడంతో తెలంగాణ వ్యాప్తంగా ఏర్పడిన జేఏసీలతోపాటు కాలనీలో టంగుటూరి రాజయ్య ఛైర్మన్‌గా జేఏసీ ఆవిర్భవించింది. తెలంగాణ ఏర్పడే వరకు ఈజేఏసీ ఆ ధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. ఉద్యమం జరిగినన్ని రోజులు రాష్ట్ర జేఏసీ, ఓయూ జేఏసీ, జేఏసీ భాగస్వామ్య పార్టీలు ఏ ఆందోళనకు పిలుపునిచ్చినా కార్యక్రమాలను విజయవంతం చేశారు. ఉద్యమానికి ఊపునిచ్చిన 35 రోజుల 'సకలజనుల సమ్మె' విజయవంతంలో కాలనీ ప్రజలు, కార్మికుల పాత్ర అనిర్వచనీయమైనది.

రహదారులపై పశువుల సంచారం

- ప్రమాదాలకు నిలయంగా మారిన రహదారులు - పట్టించుకోని హెచ్‌కేఆర్, కార్పొరేషన్ అధికారులు



గోదావరిఖని చౌరస్తాలో రోడ్లపై పశువులు, పోట్లాటకు దిగిన పశువులు(ఫైల్)

కళ్యాణ్‌నగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రహదారులపై పశువుల సంచారంతో రహదారులు నెత్తురోడుతున్నాయి. పశువుల యజమానులను రోడ్లపై వదులుతుండడంతో వాటిని గమనించక రోడ్లపై అనేక ప్రమాదాలు జరుగుతున్నా హెచ్‌కేఆర్, కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాజీవ్‌రహదారితో పాటు గోదావరిఖని మున్సిపల్ టీ జంక్షన్ నుంచి ఫైవింక్లయిన్ వరకు మందలు మందలుగా ఆవులు, గేదెలు సంచరిస్తుండడం, కొట్లాటలకు దిగుతుండడంతో అనేక మంది మృత్యువాత పడుతుండగా, కాళ్లు చేతులు విరిగి అనేక మంది గాయపడుతునాన అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. బీ పవర్‌హౌస్ నుంచి గోదావరి వంతెన వరకు రాజీవ్ రహదారిపై గుంపులు, గుంపులుగా ఎక్కడ చూసినా ఆవులు, గేదెలు రోడ్లపైనే పడుకుంటున్నాయి. ఇటీవల రాజీవ్ రహదారిపై చీకట్లో గేదెను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందగా గోదావరిఖని గాంధీనగర్ వద్ద గేదెలను ఢీకొట్టి అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. అనేక మంది గాయాలపాలయ్యారు. లక్ష్మీనగర్‌లో ఆంబోతుల వీరంగంతో ఎలక్ట్రానిక్ షాపుల్లో వస్తువులు ధ్వంసమయ్యాయి. సుమారు ఐదే షాపుల్లో టీవీలు, ఫ్రిజ్‌లు, ఇతర సామగ్రి ధ్వంసమయ్యింది.

రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట రోడ్డుపై ఉన్న పశువులను తప్పించబోయిన కారు ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఇద్దరు మృత్యువాత పడగా, మరో నలుగురు గాయ పడ్డారు. విఠల్‌నగర్‌లోని మీ సేవా సెంటర్ వద్ద నడుచుకుంటూ వెళుతున్న పాదచారులపై ఓ ఆవు దాడికి పాల్పడగా పది మంది వరకు గాయపడ్డారు. పశువుల యజమానులను గుర్తించి నోటీసులను జారీ చేసినప్పటికీ ఎలాంటి స్పందన లేదు. దీంతో ఇక్కడ పని చేసిన మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ అన్నపూర్ణకాలనీలోని బంజరుదొడ్లకు ఆవులు, గేదెలను తరలించినప్పటికీ అక్కడ నిర్వహణ లేక పోవడంతో పశువులు మళ్లీ రోడెక్కి హంగామా సృష్టిస్తున్నాయి. ఇప్పటికైనా రోడ్లపై సంచరించే పశువులను బంజరు దొడ్లకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి


పూసాల రైస్‌మిల్లు ప్రాంతంలో కరెంట్ తీగలు తగిలి మృతి చెందిన గేదె

సుల్తానాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనలలో విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి. సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రైస్‌మిల్లుల ప్రాంతంలో మేతకు వెళ్లిన గేదె సమీపంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగిలి మృతి చెందింది. ఎలిగేడు మండలం శివపల్లి గ్రామానికి చెందిన పొన్నాల కొండయ్య అనే రైతు తన గేదెను డీ-86 ప్రధాన కాలువ గట్టుకు మేతకు తీసుకుపోయాడు. అది మేస్తుండగా విద్యుత్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ లక్ష రూపాయలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నాడు. అలాగే రేగడిమద్దికుంట గ్రామంలో కూడా విద్యుదాఘాతంతో మరో పాడి గేదె మృత్యువాత పడింది.